జైపూర్ పీఏసీఎస్ అవకతవకలపై విచారణ

జైపూర్, న్యూస్‌టుడే: జైపూర్ ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) ఛైర్మన్ గుండు తిరుపతి సంస్థ నిధులు తన సొంతానికి వాడుకోవడంతో పాటు మరిన్ని అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం సహకార సంఘం అధికారులు విచారణ నిర్వహించారు. వైస్ ఛైర్మన్ సంతోషం చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు ప్రకారం.. 2022లో కార్యాలయ భవనం మరమ్మతుల పేరిట రూ.4.5 లక్షలు తీసుకొని పనులు చేపట్టకుండా సొంతానికి వాడుకున్నారన్నారు. అందులో రూ.86వేలు జమ చేయకపోవడంతో పలుమార్లు నోటీసులు ఇచ్చారన్నారు. మళ్లీ ఈ ఏడాది మరమ్మతుల పేరిట సభ్యులతో తీర్మానం చేయించారన్నారు. ఎలాంటి పెట్టుబడి లేకుండా 4,500 బస్తాల ఎరువులను గతేడాది తన బావమరిది దుకాణానికి అప్పగించి ఆర్థిక లబ్ధి పొందారన్నారు. 2021లో కార్యాలయ అవసరాలకు రూ.29,500 వస్తువులు కొనుగోలు చేసి అవి ఉపయోగించే స్థితిలో ఉన్నప్పటికీ గతేడాది మళ్లీ రూ.50,200తో కొనుగోలు చేసినట్లు బిల్లులు పెట్టారన్నారు. ప్రయాణాల పేరుతో రూ.27వేల సొంతానికి వాడుకున్నారు. దీనిపై సహకార సొసైటీకి చెందిన సహాయ రిజిస్ట్రార్ రవికిశోర్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. కొందరు అధికారులు తన ఫిర్యాదు బహిర్గత పరచడంతో అందులోని కొన్ని వస్తువులను విచారణ జరుగుతున్న రోజున ఉదయం పూట తీసుకొచ్చి పెట్టారని వైస్ ఛైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. రాజకీయ కుట్రలో భాగంగానే తనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని, సంస్థ నుంచి రూ. 2 లక్షల పైచిలుకు నగదు రావాలని ఛైర్మన్ తిరుపతి తెలిపారు.


జైపూర్ సహకార సంఘంలో విచారణ చేస్తున్న అధికారి రవికిశోర్, పక్కన పీఏసీఎస్ ఛైర్మన్ తిరుపతి

పశుగణన గోడప్రతుల విడుదల

ఏసీసీ, న్యూస్‌టుడే: అఖిల భారత పశుగణన-తెలంగాణ కార్యక్రమాన్ని జిల్లాలో పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పశువైద్య పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్‌తో కలిసి పశుగణన కార్యక్రమం గోడప్రతులను ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహించే గణనకు 127 మంది ఎన్యుమరేటర్లను నియమించినట్లు చెప్పారు.

ఒక వైపు బెబ్బులి.. మరో వైపు గజరాజు




ఏప్రిల్ నెలలో కుమురం భీం జిల్లాకు వచ్చిన ఏనుగు

● ఉమ్మడి జిల్లావాసుల్ని వణికిస్తున్న మృగాలు

ఆవాసం కోసం, తోడు కోసం వెతుక్కుంటూ వస్తున్న పులులు సరైన గమ్యస్థానానికి చేరుకునే క్రమంలో అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నాయి. ఈ మార్గంలో మనుషులకు కనిపించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యాఘ్రం లేదా మనిషి మృత్యువాతపడుతున్నారు. మరోవైపు ఏనుగు సైతం ప్రాణహిత నదిని దాటి కుమురం భీం జిల్లా సరిహద్దుల్లో సంచరిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ముగ్గురిని చంపేసిన ఏనుగు తెలంగాణలోకి వస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **-ఈనాడు, ఆసిఫాబాద్**


పులుల అభయారణ్యాల నుంచి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ టైగర్ జోన్ విస్తరించి ఉండగా, వీటి చుట్టూ మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి అభయారణ్యాలు ఉన్నాయి. వీటిలో ఏటా 30-40 వరకు పులి పిల్లలు జన్మిస్తున్నాయి. ఆవాసం వెతుక్కునే క్రమంలో కుమురం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా అడవులకు ఇవి వస్తున్నాయి. ఇలా వస్తున్నవి నేరుగా కవ్వాల్‌కు చేరుకోలేకపోతున్నాయి. నాలుగు వరుసల రహదారి, బొగ్గు ఉపరితల గనులు, పోడు వ్యవసాయం, ప్రాజెక్టుల నిర్మాణం వీటిని కవ్వాల్‌వైపు వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నాయి.

* ఈ ఏడాది ఏప్రిల్‌లో కుమురం భీం జిల్లాకు వచ్చిన ఏనుగు పెంచికల్‌పేట్, చింతలమానేపల్లి మండలాల్లో ఇద్దరు రైతులను తొక్కి చంపేసింది. రెండు రోజుల అనంతరం ప్రాణహిత నదిని దాటి మహారాష్ట్ర జిల్లాలోని గడ్చిరోలి అడవులకు వెళ్లింది. ఈ ఏనుగు మహారాష్ట్రలోనే ఉన్నా, ప్రస్తుతం తెలంగాణలోని చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల వైపు వస్తుందని అటవీ అధికారులకు పొరుగు రాష్ట్ర అధికారులు సమాచారం అందించారు. వారం క్రితం గడ్చిరోలి జిల్లాలో ఓ యువకుడు ఏనుగుతో సెల్ఫీ తీసుకునే క్రమంలో సైతం ఇదే ఏనుగు తొక్కి చంపేసింది.

ఒకటి నిలకడగా ఉంది

కవ్వాల్ ఉడుంపూర్ అటవీ ప్రాంతంలో ఒక పులి నివాసం ఏర్పర్చుకోవడం పట్ల అటవీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కెరమెరి మండలంలోని ఇందాపూర్ అటవీ ప్రాంతంలో ఆడ పులి సంచరిస్తుంది. పక్షం రోజుల్లో రెండు ఆవులను ఈ పులి చంపేసింది. ఈ పులి కవ్వాల్‌కు వెళితే జతకట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. తిప్పేశ్వర్ నుంచి వచ్చిన మగపులి భీంపూర్, బోథ్, సారంగపూర్ మీదుగా కవ్వాల్‌కు చేరుకుంటుందా లేదా అని కొద్ది రోజుల్లో తేలిపోతుంది.



ఏనుగు కదలికలపై అప్రమత్తంగా ఉన్నాం

నీరజ్‌కుమార్, కుమురంభీం జిల్లా అటవీ శాఖ అధికారి

ప్రాణహిత నది సమీపంలో తెలంగాణ చింతలమానేపల్లి మండల అటవీ ప్రాంతానికి 30-35 కిలోమీటర్ల దూరంలో ఏనుగు సంచరిస్తోంది. డ్రోన్ కెమెరాలతో ఈ ఏనుగును నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రాణహిత నదీ తీరం వెంబడి ఉన్న బెజ్జూర్, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్ మండలాల ఆయా గ్రామాల ప్రజలు రాత్రి ఆరు గంటల అనంతరం ఎవరు పంటచేల వద్దకు వెళ్లవద్దు.

జత కోసం వెతుకులాట..

న్యూస్‌టుడే, బోథ్ :

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో మూడు రోజులుగా తిరుగుతున్న పెద్దపులి.. గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో ప్రత్యక్షమైంది. పశువులపై దాడిచేసి చంపుతుండటంతో రెండు మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ సిబ్బందికి నాలుగు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దాదాపు 20 మంది బేస్ క్యాంపు సిబ్బంది పులి జాడ కోసం అడవిని జల్లెడ పడుతున్నారు. ఇది మగ పులిగా అటవీ సిబ్బంది నిర్ధారించారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం సైతం తన తోడును వెతుక్కుంటూ మహారాష్ట్ర నుంచి బోథ్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలోకి వచ్చిందని భావిస్తున్నారు. తోడును వెతుక్కునే క్రమంలో కంటికి కనిపించిన పశువులపై కోపంతో దాడి చేసి చంపుతోంది. బుధవారం చింతగూడ అటవీ ప్రాంతంలో ఎద్దుపై దాడి చేసి చంపింది. కానీ మాంసాన్ని మాత్రం తినలేదు.

తిప్పేశ్వర్ నుంచి..

-పుండలిక్, ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్వో, బోథ్

బోథ్ మండలం వజ్జర్, చింతగూడ అటవీ ప్రాంతంలో వ్యాఘ్రం సంచరిస్తుందనే మాట వాస్తవమే. రెండు రోజులుగా పులి కదలికలను గమనించాం. తిప్పేశ్వర్ అటవీ ప్రాంతం నుంచి భీంపూర్ మీదుగా బోథ్ మండలంలోని వజ్జర్ అటవీ ప్రాంతానికి వచ్చింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అటవీ ప్రాంతానికి వెళ్లొద్దు. పశువులను తీసుకెళ్లొద్దు.



2023-24కు ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన 3,850 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్‌గా మార్చి ఇవ్వాలని బెల్లంపల్లిలోని మాతేశ్వరి అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లు యజమాని దర్శనాల రమేష్‌కు అప్పగించారు. ఇందులో 346 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అప్పగించారు. మిగతా రూ.6.53 కోట్ల విలువైన ధాన్యం తిరిగి ప్రభుత్వానికి ఇవ్వకుండా అక్రమంగా మార్కెట్‌లో అమ్ముకున్నారు. దీంతో ఆ శాఖ అధికారులు తాళ్లగురజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రమేష్‌పై కేసు నమోదు చేసి అతడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

బియ్యం బుక్కేస్తున్నారు..

సీఎంఆర్ ఎగవేతదారులపై కఠిన చర్యలు

మంచిర్యాల పట్టణం, బెల్లంపల్లి పట్టణం న్యూస్‌టుడే:

సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు బియ్యంగా మార్చి అప్పగించడం లేదు. పైసా పెట్టుబడి లేకుండా వచ్చిన బియ్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల బకాయి ఉన్న సీఎంఆర్ సేకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. గడువులోగా ఇవ్వని మిల్లుల యజమానులపై కఠిన చర్యలకు ఉపక్రమించింది.

మంచిర్యాల జిల్లాలో దాదాపు 39 మంది రైలు మిల్లర్లు సీఎంఆర్ ఎగవేత జాబితాలో ఉన్నారు. గడువు దాటినా సీఎంఆర్ సరఫరా చేయని మిల్లర్లకు 25 శాతం అదనంగా జరిమానా విధించి బియ్యం వసూలు చేయాలని ఇటీవల గడువు విధించింది. పలు మార్లు గడువు పొడిగించింది. అయినా ప్రభుత్వానికి బియ్యం అప్పగింతలో రైస్ మిల్లు యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

✦ హాజీపూర్ మండలంలోని దుర్గా రైస్‌మిల్లులో రూ.10 కోట్ల విలువైన బియ్యం కూడా అదే దర్శనాల రమేష్ అక్రమంగా అమ్ముకున్నట్లు గుర్తించారు. అతనిపై హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

రెండు నెలల కిందట చెన్నూరులో..

చెన్నూరు మండలం కిష్టంపేటలోని రైస్ మిల్లు యజమాని సీఎంఆర్ సరఫరాలో నిర్లక్ష్యం చేసినందుకు రెండు నెలల కిందట పౌర సరఫరాల శాఖ అధికారులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఆ రైలు మిల్లు యజమాని దాదాపు రూ.1.32 కోట్ల విలువైన సీఎంఆర్‌ను గడువులోగా ప్రభుత్వానికి ఇవ్వలేదు. అక్రమాలకు పాల్పడినందుకు ఆ మిల్లును సీజ్ చేశారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

కోటపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కోటపల్లి మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు వసతి గృహాలను శుక్రవారం సందర్శించారు. గిరిజన ఆశ్రమ, కస్తూర్బా, ఎస్సీ బాలుర వసతిగృహాలతో పాటు ఆదర్శ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని సూచించారు.


కస్తూర్బా విద్యాలయంలో వంటను పరిశీలిస్తున్న కలెక్టర్

వసతుల లేమి.. పట్టించుకోరేమి?

బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల దుస్థితి ..

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సమస్యలతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బెల్లంపల్లిలో 2000 సంవత్సరంలో భవనం ప్రారంభమైంది. అప్పటి నుంచి నిర్వహణ నిధులు మంజూరు కావడం లేదు. 481 మంది విద్యార్థులు ఉన్న కళాశాలలో వసతుల లేమి స్పష్టంగా కనిపిస్తోంది. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు ఇలా ఒక్కటేంటి అన్నీ సమస్యలే.. భవనం సైతం ప్రమాదకరంగా మారింది.

● కళాశాల భవనాన్ని 2000 సంవత్సరానికి ముందు నిర్మించారు. నిర్మాణం సమయంలోనే ఒకటో అంతస్తు వేసిన తర్వాత ఒక్కసారిగా కూలిపోయింది. కళాశాల కింది నుంచి బొగ్గు భూగర్భ గని పాయలు వెళ్లడంతో కూలిపోయిందని ఆ సమయంలో గుర్తించారు. వెంటనే దిశ మార్చి నిర్మించారు. ఇప్పుడు కళాశాల భవన గోడలతో పాటు పిల్లర్లకు పగుళ్లు రావడం ఆందోళన కలిగిస్తోంది. భవనం పునాదులు కుంగిపోయి కనిపిస్తున్నాయి.


గోడతో పాటు కళాశాలలో పగుళ్లు తేలిన పిల్లరు


పగిలిన మురుగు పైపులు

తాగునీటికి తండ్లాట..

కళాశాలలో ఆరు నెలల నుంచి శుద్ధ జల యంత్రం పనిచేయడం లేదు. విద్యార్థులు వసతి గృహాలకు వెళ్లి నీటిని తాగుతున్నారు. నిర్వహణ ఖర్చులు లేకపోవడంతో అధ్యాపకులు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాగునీరు లభించక విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు.

ఫలితాలు బాగున్నా... సౌకర్యాలు సున్నా

పాలిటెక్నిక్ కళాశాలలో ఏటా ఫలితాలు ప్రైవేటు కళాశాలలకు దీటుగానే వస్తున్నాయి. గత విద్యా సంవత్సరంలో 90 శాతం ఫలితాలను కళాశాల సాధించింది. ప్రస్తుతం కళాశాలకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా మైనింగ్ హెచ్ఓడీ దేవేందర్ కొనసాగుతున్నారు. మరో ఇద్దరు హెచ్ఓడీలు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్స్‌గా వేరే ప్రాంతానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. గణితం అధ్యాపకుడు ఒక్కరే ఉండగా నాలుగు రోజులు బెల్లంపల్లిలో మరో రెండు రోజులు మణుగూరు కళాశాలకు వెళ్లాల్సి వస్తోంది. గణితం విషయంలో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.


మరమ్మతులు చేయని శుద్ధ జల యంత్రం

సమస్యలివీ..

✦ కళాశాల భవనం నిర్మించినప్పటి నుంచి ఒక్కసారి కూడా మరమ్మతులు చేయలేదు.
✦ డిప్లొమా తృతీయ సంవత్సరం విద్యార్థులు ఉంటున్న బాలుర వసతి గృహం భవనం పైకప్పు పెచ్చులూడి కూలిపోతోంది.
✦ పాత బాలుర వసతిగృహంలో మూత్రశాలలు, మరుగుదొడ్ల పైపులు పగిలిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది.
✦ బాలికలకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు.

వాహన చోదక.. అప్రమత్తంగా ఉండాలిక

మొన్నటి వరకు జిల్లా కేంద్రంలోని వ్యాపార సముదాయాల్లో వాహనాలకు పార్కింగ్ దారి మధ్యలో ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఆ నిబంధన తొలగించారు. రెండు, నాలుగు చక్రాల వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలి. ఆ ప్రాంతాల్లోని దుకాణాలకు వెళ్తే అక్కడే నిలపాలని ట్రాఫిక్ పోలీసులు, పురపాలిక శాఖ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. నాలుగైదు రోజులుగా నిత్యం అక్కడ పర్యవేక్షిస్తూ మధ్యలో నిలిపిన వాహనాలను ఫొటోలు తీసి జరిమానా విధిస్తున్నారు. అప్రమత్తంగా ఉంటూ నూతన నిబంధనలకు అనుగుణంగా పార్కింగ్ చేయాల్సిన అవసరముంది. **- న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ:**



తీగలపై దుస్తులు.. ప్రమాద కారకాలు

జైపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో ప్రమాదం పొంచి ఉంది. విద్యార్థులు ఉన్న కొన్ని గదుల్లో వారి మంచాలకు అతి సమీపంలోనే కరెంట్ బోర్డులు ఉన్నాయి. వాటికి రక్షణ లేకపోవడంతో రాత్రివేళ నిద్రమత్తులో ఏమైనా పొరపాటు జరిగితే ప్రమాదం జరిగే అవకాశముంది. పర్యవేక్షణ లేమితో కొందరు విద్యార్థులు తమ దుస్తులను కరెంట్ తీగలపై ఆరబెట్టుకుంటున్నారు. దీనిపై వార్డెన్ సాయి లచ్చన్నను వివరణ కోరగా మంచాలకు సమీపంలో ఉన్న స్విచ్‌బోర్డులను వేరే చోటికి మార్పిస్తామన్నారు. బయట తీగలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **- జైపూర్, న్యూస్‌టుడే**



విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ విద్యుత్తు ఉపకేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్(5.0ఎంవీఏ స్థానంలో 8.0ఎంవీఏ ఏర్పాటు)పునరుద్ధరణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వేణుగోపాల్, ఏఈ నర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌నగర్, తెలంగాణనగర్, దొరగారిపల్లె, గోపాల్‌వాడ, రైల్వే ఏ-కాబిన్ ఏరియా, వేములబస్తీ, హమాలీవాడ, సూర్యనగర్, తిలక్‌నగర్, తోళ్లవాగు, శ్రీశ్రీనగర్, సాయికుంట, మజీద్‌వాడ, అశోక్‌రోడ్, తిరుమలగిరి కాలనీ, చున్నంబట్టివాడ, రాజరాజేశ్వరకాలనీ, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం

? మంచిర్యాలలోని హనుమాన్ నగర్, రోడ్డు నెం.1లో విద్యుత్తు దీపం వెలగడం లేదు. రాత్రి చీకటితో ఇబ్బంది ఎదురవుతోంది.
- హనుమాన్‌నగర్ కాలనీవాసులు, మంచిర్యాల

✔ రెండు రోజుల్లో అక్కడ విద్యుద్దీపం ఏర్పాటు చేయిస్తాం.
- మసూద్ అలీ, మున్సిపల్ ఇంజినీరు, మంచిర్యాల

? మంచిర్యాలలోని హనుమాన్‌నగర్ రోడ్డు నెం.1లో కంకణాల సత్య నారాయణరెడ్డి ఇంటి దగ్గర మురుగు కాలువ నిండి దుర్వాసన వస్తోంది. అక్కడ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రంగా ఉంది.
- హనుమాన్‌నగర్ కాలనీవాసులు, మంచిర్యాల

✔ రెండు రోజుల్లో అక్కడ మురుగు కాలువ శుభ్రం చేసి పిచ్చి మొక్కలు తొలగిస్తాం.
- రాజ మనోహర్, మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం సూపర్‌వైజర్, మంచిర్యాల

నిబంధనల అమల్లో నిర్లక్ష్యం



శ్రీరాంపూర్‌లో బొగ్గు తరలించే లారీ డ్రైవర్లు టార్పాలిన్ కవర్లు కప్పకుండా రాకపోకలు సాగించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెనుక వచ్చే వాహనదారులపై బొగ్గు పెళ్లలు పడటంతోపాటు దుమ్ము, ధూళి కళ్లలో పడి ప్రమాదాలకు ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి బొగ్గును తరలించే లారీ యజమానులు, డ్రైవర్లు కనీస జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నస్పూర్

ప్లాస్టిక్‌తో పశువులకు ఇక్కట్లు

ధర్మారావుపేట సెక్షన్ పరిధి బుగ్గ ఆలయ ఆవరణలోకి వచ్చే భక్తులు, పర్యాటక ప్రాంతాలకు వచ్చేవారు ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. ఈ ప్లాస్టిక్ వస్తువులను ఆవులు తింటున్నాయి. ఫలితంగా అవి జీర్ణంకాక మృతి చెందుతున్న ఘటనలున్నాయి. ప్లాస్టిక్‌ను పడేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కాసిపేట



ఆయుధం చూపించి.. పనితీరు వివరించి



హాజీపూర్, న్యూస్‌టుడే: హాజీపూర్ మండలం గుడిపేటలోని టీజీఎస్పీ 13వ పటాలంలో శుక్రవారం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు ఓపెన్‌హౌస్ నిర్వహించారు. పటాలం కమాండెంట్ పి.వెంకటరాములు వివిధ ఆయుధాల పనితీరు, వినియోగం, శుభ్రం చేసే విధానం, భద్రత తదితర అంశాలను వివరించారు. పటాలం అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాస్, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చాలా గొప్పది



రక్తదాన పత్రాలను అందుకుంటున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రక్తదానంపై అపోహలు వద్దని ఏసీపీ రవికుమార్ అన్నారు. శుక్రవారం పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏసీపీ రవికుమార్‌తో పాటు సీఐలు, ఎస్‌ఐలు రక్తదానం చేశారు. ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. 233 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సీఐలు అఫ్జలుద్దీన్, కుమారస్వామి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు అభినవ సంతోష్‌కుమార్, శ్రీనివాస్, సురభి శరత్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు మండలం రేచిని రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుని వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని చెప్పారు. మృతుని సమాచారం తెలిస్తే జీఆర్‌పీ పోలీసులకు అందజేయాలని కోరారు.

పురుగు మందు తాగి మహిళ..

భీమారం, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యతో జీవితంపై విరక్తి చెందిన మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భీమారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మచ్చ విజయలక్ష్మి(31) కొంత కాలంగా కడుపునొప్పి, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతోంది. గురువారం ఇంటి వద్ద పురుగు మందు తాగింది. అస్వస్థతకు గురికాగా కుటుంబసభ్యులు బాధితురాలిని మంచిర్యాల అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఆసుపత్రులకు తరలించి వైద్యచికిత్సలు అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్వేత తెలిపారు.

భార్యాభర్తలపై కేసు నమోదు

మంచిర్యాల నేరవిభాగం: భార్యాభర్తలు పరస్పరం దాడులు చేసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 14న రైసాభాను తన భర్త ఇలియాస్‌ను ఇనుపకడ్డీతో కొట్టి గాయపరిచింది. ఈ నెల 18న ఇలియాస్ సుత్తితో భార్య రైసాభానుపై దాడి చేశాడు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో అధ్యాపకుడి మృతి

కోటపల్లి: కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామానికి చెందిన రావుల రాజమల్లు (48) అనే అధ్యాపకుడు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో మృతిచెందాడు. మందమర్రి జూనియర్ కళాశాలలో జూనియల్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

మహారాష్ట్రకు తరలిస్తున్న మద్యం పట్టివేత

కోటపల్లి, న్యూస్‌టుడే: మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం అర్ధరాత్రి రామగుండం టాస్క్‌ఫోర్స్, కోటపల్లి పోలీసులు కలిసి పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, కోటపల్లి ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి ప్రాణహిత సరిహద్దుకు కారులో తరలిస్తున్న మద్యాన్ని సిర్సా గ్రామంలోని ఫెర్రిపాయింట్ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కారు చోదకుడు పెండ్యాల కిరణ్ మంచిర్యాలలోని లక్ష్మీబాలాజి మద్యం దుకాణంలో కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రానికి తరలిస్తున్నాడని తమ విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. రూ. 40 వేల విలువైన మద్యంతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పోటీలో నిలిచి.. బహుమతులు గెలిచి



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న శ్రీచైతన్య విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ జోబిన్

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కల్గి ఉండాలని వివిధ రంగాల్లో వారిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తుంది. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఇంటర్నెట్ వినియోగంపై లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8వ తరగతి విద్యార్థిని ఆడెపు అక్షర ప్రథమ స్థానం, బి.శ్రీవైష్ణవి(9వ) ద్వితీయ స్థానం, బి.గౌతమ్‌నంద(8వ) తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని ప్రిన్సిపల్ జోబిన్ అభినందిస్తూ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏవో విలాస్, పీఈటీ రాజేందర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక కోర్సుల ఏర్పాటుకు చర్యలు

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలోని మందమర్రి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఆధునిక సాంకేతిక విద్యా కోర్సులు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన గూగుల్ మీట్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో మందమర్రి కళాశాలలో అందిస్తున్న కోర్సుల్లో 172 సీట్లకు ఇప్పటి వరకు 149 సీట్లు భర్తీ అయ్యాయని మిగిలిన ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. రెండో విడతలో నస్పూర్, మంచిర్యాలలోని కళాశాలల్లో కోర్సులు అందించేందుకు అవసరమైన పనులు కొనసాగుతున్నాయన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించండి

దండేపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన అయిదు డీఏలతో పాటు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్ తదితర బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు నీలేశ్ కచ్‌వాల్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మండలంలోని వివిధ పాఠశాలల్లో ఆవిష్కరించారు. 28న తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తామని, నవంబరు 5న కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామన్నారు. మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పల రూపాచారి, వై.శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు ఉమ, రాజేందర్ పాల్గొన్నారు.

ఎంసీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఎంసీపీఐ నాయకులు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కార్మిక శాఖ ఆన్‌లైన్ సేవలు పునరుద్ధరించాలని పట్టణంలోని కాంటా చౌరస్తాలో ఎంసీపీఐ, ఏఐసీటీయూ ఆధ్వర్యంలో నాయకులు రాస్తారోకో చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ రెండు నెలల నుంచి కార్మిక శాఖకు చెందిన ఆన్‌లైన్ పనిచేయడం లేదని ఆరోపించారు. చాలా మంది కార్మికులు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేయలేకపోతున్నారని చెప్పారు. కార్మిక శాఖ నుంచి రావాల్సిన జనన, మరణ, పెళ్లికి సంబంధించిన ప్రయోజనాలు అందడం లేదన్నారు. ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్, నాయకులు రమేష్, రాజయ్య, సత్తయ్య, శంకర్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ చొరవతోనే పీఎల్‌ఆర్ పెరుగుదల

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: దీపావళీ బోనస్ (పీఎల్‌ఆర్) పెంపుపై దిల్లీలో జరిగిన చర్చల్లో జాతీయ సంఘాల నుంచి సింగరేణి తరఫున హెచ్‌ఎంఎస్, బీఎంఎస్ అగ్ర నాయకులు రియాజ్ అహ్మద్, యాదగిరి సత్తయ్య మాత్రమే పాల్గొన్నారని మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ ఈ చర్చల్లో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాల ఇతర రాష్ట్రాల నాయకులకు మాత్రమే ప్రాతినిధ్యం వహించారని ఆరోపించారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ.8250 పెంపులో హెచ్‌ఎంఎస్ పాత్ర కీలకమని చెప్పారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

కాసిపేట, న్యూస్‌టుడే: సింగరేణి కార్మికులు విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కాసిపేట 2 గనిలో బెల్లంపల్లికి చెందిన సతీశ్, శ్రీకాంత్‌లు కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం రాత్రి షిఫ్ట్‌లో విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై శుక్రవారం ఉదయం బెల్లంపల్లికి వెళ్తున్నారు. పెద్దనపల్లి శివారులోని కల్వరి చర్చి సమీపంలోని జాతీయ రహదారిపై పక్కన ఆగి ఉన్న స్కూల్ బస్సును వెనకనుంచి ఢీ కొట్టారు. ప్రమాదంలో గాయాలైన ఇద్దరిని హుటాహుటీన బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు.

ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణిలో పని చేస్తున్న ఒప్పంద కార్మికుల వేతనాలు తక్షణమే పెంచాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం రవీంద్రఖని-7 గని వద్ద మాట్లాడుతూ తమ పోరాటాల ఫలితంగా యాజమాన్యం సంస్థ లాభాల్లో వీరికి రూ.5 వేలు చెల్లించిందన్నారు. 2022లో కార్మిక సంఘాలతో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అభ్యర్థులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్ గ్రామీణం: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న 10 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఉద్యోగాల భర్తీకి మెడికల్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఎస్‌ఓటు జీఎం ఎన్.సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అభ్యర్థుల ధ్రువ పత్రాలు పరిశీలించారు. మూడు రోజులు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 281 మంది హాజరు కాగా వారిని వైద్యులు, కమిటీ సభ్యులు పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేశారు. డీజీఎం(పీ) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డీవైసీఎంఓ డాక్టర్ పి.రమేష్‌బాబు, డాక్టర్ సమీరా సందాని పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు మొండయ్య

జన్నారం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై సీనియర్ సిటిజన్స్ చాలా జాగ్రత్తగా ఉండాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సాయిండ్ల మొండయ్య, విశ్రాంత తహసీల్దార్ రాజయ్య అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వయోవృద్ధుల పోషణ చట్టం 2007, 2011 గురించి వివరించారు. రాష్ట్ర కో-ఆర్డినేటర్ శ్యాంకుమార్, కస్తూరి నాగేశ్వర్, గోపి సత్యనారాయణ, అక్కవత్తుల దేవయ్య, మురళి, తారాచందు, భాస్కర్‌గౌడ్, లచ్చన్న, పుల్లయ్య, రాజం, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ప్రముఖులు



జస్టిస్ ఈవీ వేణుగోపాల్‌కు మొక్క అందజేస్తున్న శ్రీనివాస్

జైపూర్ న్యూస్‌టుడే : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్‌ను శుక్రవారం రాత్రి సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రంలోని అతిథి గృహం వద్ద జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అర్పితా మారంరెడ్డి, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు రాంమోహన్‌రెడ్డి, డా.సంపత్‌కుమార్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్, బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

కనకరాజు మృతికి ఎమ్మెల్యే సంతాపం

మంచిర్యాల అర్బన్: గుస్సాడీ నృత్య కళాకారుడు కనకరాజు మృతిపై శుక్రవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సంతాపం ప్రకటించారు. గుస్సాడీ నృత్యానికి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన కళాకారుడిగా తన పేరును సుసంపన్నం చేసుకున్నారని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అఘోరి మాత కలకలం

నెన్నెల, న్యూస్‌టుడే: ఇటీవల తెలంగాణలో అఘోరి మాత పేరిట సామాజిక మాధ్యమాల్లో కలకలం సృష్టిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. నెన్నెల మండలం కుశ్నపల్లి చెందిన ఎల్లూరి శ్రీనివాస్ నాలుగు సంవత్సరాల కింద ఇంటి నుంచి వెళ్లి అఘోరిగా మారారు. తిరిగి ఏడాది కిందట గ్రామానికి వచ్చారు. ఆ సమయంలో లోక కల్యాణం కోసం ఇలా మారనని బంధువులు, కుటుంబ సభ్యులకు చెప్పారు. తరువాత అఘోరి మాతగా మారినట్లు చెప్పుకుంటున్నారు. వారం రోజుల కిందట హైదరాబాద్‌లోని ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసమైన సందర్భంగా పూజలు నిర్వహించడం వివాదాస్పదమైంది. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. సిద్దిపేట పోలీస్‌స్టేషన్‌లో సైతం తన ప్రాణాలకు హాని ఉందని ఫిర్యాదు చేశారు. ఈ విషయం నెన్నెల మండలంలో చర్చనీయాంశంగా మారింది.

క్రీడల్లో గెలుపోటములు సహజం

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని మున్సిపల్ ఛైర్మన్ నలుమాసు కాంతయ్య అన్నారు. మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఛాంపియన్‌గా నిలిచిన చెన్నూరు గురుకుల జట్టును ఆయన అభినందించారు. ఆర్‌సీవో గోపీచంద్, డీసీవో శ్రీధర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

మొదలైన దండారి ఉత్సవాలు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి నది ఒడ్డున కొలువై ఉన్న గిరిజనుల ఆరాధ్య దైవం పద్మల్‌పురి కాకో అమ్మవారి ఆలయంలో శుక్రవారం దండారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గంగాజలంతో అమ్మవారికి అభిషేకం చేశారు. సంప్రదాయ గిరిజనుల దండారీ నృత్యం ఆకట్టుకుంది. పూజల అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



కాకో అమ్మవారికి పూజలు చేస్తున్న గిరిజనులు



దండారి నృత్య ప్రదర్శన

28న ఉమ్మడి జిల్లా సదస్సు

ఏసీసీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లపై ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వెనకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, పుర ఛైర్మన్లు ప్రజాప్రతినిధులతో పాటు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన సంఘాల ప్రతినిధులు హాజరై తమ సూచనలు అందించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాలలో నవంబరు 8, 9 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా 3వ మహాసభలు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగుల భాస్కర్ కోరారు. మంచిర్యాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సీపీఎం జిల్లా మహాసభలను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు ఎస్.రవి, దాసరి రాజేశ్వరి, అశోక్, రంజిత్‌కుమార్, చందు, గోమాస ప్రకాష్, రాజారాం పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యూషన్ ఫీజు చెల్లింపు



చెక్కు అందజేస్తున్న మందమర్రి ఏరియా జీఎం దేవేందర్

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రాంజీ గోండ్ విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి సింగరేణి మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ ట్యూషన్ ఫీజు చెక్కులను వనవాసీ కల్యాణ పరిషత్ సభ్యులకు అందజేశారు. ప్రతి ఏడాది రాంజీ గోండ్ విద్యార్థులకు సింగరేణి సంస్థ ట్యూషన్ ఫీజు చెల్లిస్తూ వస్తుంది. జీఎం మాట్లాడుతూ గిరిజన విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. పీఓ శ్యాంసుందర్, వనవాసీ కల్యాణ పరిషత్ గౌరవ అధ్యక్షుడు కొడిప్యాక విద్యాసాగర్, తిరుపతి, కోశాధికారి లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు ఇంగు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

స్టార్ ఈఎమ్‌టీగా శహబాజ్

చెన్నూరు, న్యూస్‌టుడే: మెరుగైన సేవలు అందించినందుకు 108 ఈఎమ్‌టీగా విధులు నిర్వర్తిస్తున్న చెన్నూరు పట్టణానికి చెందిన శహబాజ్ జిల్లా ఉత్తమ స్టార్ ఈఎమ్‌టీగా ఎంపికయ్యారు. శుక్రవారం మంచిర్యాలలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, సంపత్, గజేందర్ శహబాజ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

హరిత రిసార్ట్ మేనేజర్‌కు ఎక్స్‌లెన్సీ అవార్డు



ప్రశంసా పత్రం అందుకుంటున్న వీరేంద్రకుమార్

జన్నారం, న్యూస్‌టుడే: జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్ మేనేజర్ వీరేంద్రకుమార్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రిసార్ట్‌కు వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా విధులు నిర్వర్తించారు. దీంతో పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో వీరేంద్రకుమార్ ప్రశంసాపత్రాన్ని తీసుకున్నారు. ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకున్న ఆయనను పలువురు అభినందించారు.

సంక్షిప్తం

■ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నస్పూర్: విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఆయుష్ ఇన్‌ఛార్జి పద్మజ పేర్కొన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. విద్యాలయ ప్రత్యేక అధికారి మౌనిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

■ యువతికి సన్మానం

జన్నారం: మండల కేంద్రంలోని వినాయక్‌నగర్ కాలనీకి చెందిన సల్లా సుస్మిత ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించారు. కాలనీ వాసులు శుక్రవారం యువతితో పాటు తల్లిదండ్రులను సత్కరించారు. కాలనీవాసులు మోహన్‌రెడ్డి, సుజాత, హరికృష్ణ పాల్గొన్నారు.

■ 27న జిల్లాస్థాయి ఉషు పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం: పాఠశాల క్రీడా సమాఖ్య ఈనెల 27న అండర్-17బాలబాలికల జిల్లాస్థాయి ఉషు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ మండలం సీసీసీలోని ఆదిత్య హైస్కూల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

■ 27న జోనల్‌స్థాయి బాస్కెట్‌బాల్..

మంచిర్యాల క్రీడావిభాగం: పాఠశాల క్రీడా సమాఖ్య ఈనెల 27న అండర్-14, 17 బాలబాలికల విభాగంలో జోనల్‌స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

■ పోలీసు విధులు-చట్టాలపై అవగాహన

రామకృష్ణాపూర్: పోలీసు స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రామకృష్ణాపూర్ తవక్కల్ పాఠశాలలో విద్యార్థులకు పోలీసు విధులు-చట్టాలు అంశంపై అవగాహన కల్పించారు. వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై రజిత తదితరులు ఉన్నారు.

■ ఉపకార వేతనాల విడుదలకు డిమాండ్

చెన్నూరు: విద్యార్థులకు బకాయి పడ్డ ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్లను తక్షణం విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం చెన్నూరు మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రీహరి, రిషి, జయంత్, యశ్వంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి పట్టణం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మందమర్రి తహసీల్దార్ కార్యాలయం ముందు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ తహసీల్దార్ సతీష్‌కు వినతి పత్రం అందజేశారు.

■ ఆర్థికసాయం అందజేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి పురపరిధిలోని రెండో వార్డు కనకదుర్గ కాలనీకి చెందిన హర్షవర్ధన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు రూ.18,000 నగదును శుక్రవారం అందజేశారు. అధ్యక్షుడు కాయం తిరుపతి, సట్ల మహేందర్, తూముల సురేష్, సతీష్, సంపత్, సుభాష్, శ్రీనివాస్, తిరుపతి తదితరులు ఉన్నారు.

■ పోలీసుల త్యాగం మరవలేనిది

భీమారం: ప్రజల శాంతి భద్రతల కోసం ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు మరవలేనివని భీమారం ఎస్సై శ్వేత అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కళాజాత నిర్వహించారు. పాటలు, కథల రూపంలో పోలీసుల త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో మాచర్ల, సంతోష్, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

■ ఎస్‌ఏ-1 పరీక్షల పరిశీలన

నెన్నెల: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్‌ఏ 1 పరీక్షలను జిల్లా క్వాలిటీ అధికారి సత్యనారాయణమూర్తి పరిశీలించారు. పరీక్షలు రాసే సమయంలో రెండు గంటల పాటు విద్యార్థుల నైపుణ్యాలపై పరిశీలించారు.

■ ఓటరు నమోదు పత్రాల పంపిణీ

దండేపల్లి గ్రామీణం: ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి రవి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావనవేని రవి, మల్యాల మల్లేశ్ కోరారు. దండేపల్లి మండలం లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఓటరు నమోదు పత్రాలను పంపిణీ చేశారు. తనుకు నాగేశ్వర్‌రావు, అప్పాల మనోహర్, పాత రమేశ్, కర్నె నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

■ ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయండి

మందమర్రి పట్టణం: జన్నారంలో ఆదివారం జరిగే ఉమ్మడి జిల్లా మాదిగల ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య, మండల ఇన్‌ఛార్జి జేడి సారంగం పిలుపునిచ్చారు. శుక్రవారం మందమర్రిలో మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సంఘం వ్యవస్థాపకుడు మందకృష్ణ హాజరుకానున్నారని పేర్కొన్నారు. శివకుమార్, రాజ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

■ ప్రజల దృష్టి మరల్చేందుకే అసత్య ఆరోపణలు

లక్షెట్టిపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకే కాంగ్రెస్ నాయకులు విపక్ష పార్టీలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని భారతీయ జనతా పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బొప్పు కిషన్, వీరమల్ల హరిగోపాల్ రావులు దుయ్యబట్టారు. శుక్రవారం స్థానిక విశ్రాంతి భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు బుద్దె లక్ష్మణ్, ప్రభాకర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

■ చెకుముకి ప్రచార పత్రాల విడుదల

మంచిర్యాల విద్యావిభాగం: విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్-2024ను నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జేవీవీ సభ్యులతో కలిసి సంబంధిత ప్రచార పత్రాలను విడుదల చేశారు. నవంబరు 7 పాఠశాల స్థాయి, 21న మండల, 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 14, 15, 16, తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నట్లు తెలిపారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. జేవీవీ సభ్యుడు ఎడ్లకిష్టయ్య, సైన్స్ అధికారి మధుబాబు, దేవయ్య, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ నాణ్యమైన బోధన అందించండి

చెన్నూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ ఉపాధ్యాయులను ఆదేశించారు. చెన్నూరు మండలంలోని ఆస్నాద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి సందర్శించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు.

■ వృద్ధులకు దుస్తుల పంపిణీ

ఏసీసీ: జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలోని 15 మంది సభ్యుల రక్తదానంతో పాటు చున్నంబట్టీవాడలోని ఆనంద నిలయంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక గర్మిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 100 విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన ప్లేట్‌లు, గ్లాసులను అందించారు. మాతా శిశు ఆసుపత్రిలో అన్నప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు బాలమోహన్, ప్రోగ్రాం ఛైర్మన్ వి.మధుసూదన్‌రెడ్డి, హనుమంతరావు పాల్గొన్నారు.



ఆర్కేపీలో ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు

అండర్-19 ఫుట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక పోటీలను శుక్రవారం రామకృష్ణాపూర్ ఠాగూర్ మైదానంలో నిర్వహించారు. కళాశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన బాలుర జట్టును ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ బాబురావు తెలిపారు వచ్చే నెల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పీడీ రాజయ్య, శిక్షకుడు రవికుమార్, పీఈటీ సురేందర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్..



ఎంపికైన విద్యార్థినితో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి

తాండూరు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన ఎం.అమూల్య ఎంపికైంది. అండర్-17 బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌లో సత్తా చాటింది. అచ్చలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అమూల్య 8వ తరగతి చదువుతుంది. ఈ నెల 28వ తేదీ నుంచి 30 వరకు గోదావరిఖనిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ఆడనుంది. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు బి.ఉమాదేవి, పీడీ సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో పీడీ రాజయ్య

మంచిర్యాల క్రీడావిభాగం: మహబూబ్‌నగర్ జిల్లాలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రేణి రాజయ్య తెలిపారు. జిల్లాలో జరిగిన అండర్-19 బాలుర జోనల్‌స్థాయి పోటీల్లో కార్తిక్, వాగయ్య, ప్రణయ్ ప్రతిభ చాటి అర్హత సాధించారని చెప్పారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తాచాటేందుకు మరింత కసరత్తుకు సిద్ధమవుతున్నారని, జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా సాధన చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

హాకీ పోటీలు ప్రారంభం

ఉట్నూరు: ఉట్నూరులోని కుమురం భీం మైదానంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలను ఐటీడీఏ డీడీ వసంత్‌రావు ప్రారంభించారు. గిరిజన విద్యార్థులు హాకీ క్రీడలో రాణించడం హర్షణీయమన్నారు. గిరిజన సంక్షేమశాఖ క్రీడాధికారులు పార్థసారథి, భుక్య రమేష్, హెచ్‌ఎం రాథోడ్ ఉత్తం, ఏఎస్‌వో హేమంత్, పవార్ లక్ష్మణ్, కోచ్‌లు రవీందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం.. మానవత్వపు నేస్తం



మళ్లీ..జీవాలను మేతకు తీసుకెళ్తున్న ఇనేష్

జీవితంపై పిడుగు దాతల గొడుగు..

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాంసింగ్ తండాకు చెందిన దివ్యాంగుడైన చవాన్ ఇనేష్‌కు గొర్రెల మందనే జీవనాధారం. ఎప్పటి లాగే వాటిని మేతకు తీసికెళ్లగా ఇటీవల పిడుగుపడి 70 జీవాలు మృత్యువాత పడ్డాయి. రోజూ వాటిని మేపేందుకు వెళ్లే ఆ వ్యక్తికి తెల్లవారి పని లేకుండా పోయింది. దాదాపు రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఏం చేయాలో తెలియని దైన్యం. ఈ స్థితిలో సమీప తండాల్లోంచి మానవతామూర్తులు కదిలివచ్చారు. తలా ఒకటీ రెండు జీవాలను ఇనేష్‌కు ఇచ్చారు. పిడుగు పడి అతలాకుతలమైన ఆ బడుగు జీవిపై గొడుగు పట్టారు. 40 జీవాలను అందించి మళ్లీ ఆయనకు బతుకు దారి చూపించారు. ఒకరి కష్టాన్ని పది మంది పంచుకుంటే సమస్య ఎంత తేలికవుతుందో నిరూపించారు ఆ మంచి మను(సు)షులు..

సహజంగా ప్రతి మనిషికీ ఏవో కష్టాలు వస్తూనే ఉంటాయి. వాటిని ఎదుర్కోలేని పరిస్థితుల్లో ఉన్న వారు అల్లాడుతుంటారు. అయ్యో నాకు ఇలా అయ్యిందేంటీ అని బాధపడుతుంటారు. దేవుడా నన్ను గట్టెక్కించూ అని వేడుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఎవరైనా చేయూతనిస్తేనో.. చేతనైనంత సాయం చేస్తేనో ఊరట పొందుతారు. తాను కొలిచే దైవమే సాక్షాత్తూ కళ్ల ముందుకు వచ్చిందని ఆ మనిషిలో దేవున్ని చూస్తారు. మానవత్వం పరిమళించి తోటి వారి ఇబ్బందుల్లో పాలుపంచుకునే వారు ఎదుటి వారి గుండెల్లో గూడు కట్టుకుంటారు.

-న్యూస్‌టుడే, మామడ,

ధన రాసులే ఉండక్కర్లేదు..

మానవత్వానికి కొలమానం డబ్బు మాత్రమే కాదు. ధనం దానం చేస్తేనే మేలు చేసినట్లు కాదు. ఎన్నో రకాలుగా మంచి చేయవచ్చు. ఒక్కోసారి మనం చేసే మాట సాయమే కొందరి జీవితాల్లో వెలుగులు నింపుతాయి. కింద పడిపోతున్న ఓ వ్యక్తిని పట్టుకోగలిగినా.. ప్రవాహంలో కొట్టుకుపోతున్న మనిషిని ఒడ్డుకు చేర్చగలిగినా, కారుమబ్బులు ఆవరించి కటిక చీకటిలా మారిన జీవితాల్లో వెలుగులను ప్రసరింప చేసే ఏ కార్యం చేసినా కాంతిమూర్తులవుతారు.

అభినందనీయం అభిమన్యు బృందం..

ఉట్నూరు ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల వేదికగా ఏర్పాటైన 'అభిమన్యు వాట్సాప్ గ్రూపు' ఎన్నో సందర్భాల్లో అపదలో ఉన్న, అత్యవసరమైన వారికి అండగా నిలుస్తూ మానవత్వపు పరిమళాలు వెదజల్లుతోంది. దాదాపు పదేళ్ల క్రితం గాదిగూడ మండలం లోకారికి చెందిన శేఖర్‌బాబు ప్రారంభించిన ఈ గ్రూపులో 800 మంది సభ్యులున్నారు. వీరంతా కలిసి ఇప్పటి వరకు విద్య, వైద్యం, ఇతర అవసరాల కోసం రూ.లక్షల్లో సాయం చేశారు. అక్కడి మానవసేవయే మాధవ సేవ గ్రూపు సైతం సేవల్లో ముందుంటోంది.



చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సాయమందించి సన్మానిస్తూ..

వా(హ్యా)ట్సాప్ గ్రూపులు..

సామాజిక మాధ్యమాలు విస్తృతమయ్యాక సాయమందించే ఆలోచన ఉన్న చేతులు ఒక్కటవుతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆపన్న హస్తం అందించే వారు బయటకొస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాల్లో 'రక్తదాతల' గ్రూపులు చేస్తున్న సేవలకు హ్యాట్సాప్ చెప్పాల్సిందే. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌లలో కనీసం రోజుకు 20 మందికి పైగానే వాట్సాప్ గ్రూపుల్లో చూసి అవసరమున్న వ్యక్తులకు అత్యవసరంగా వెళ్లి రక్తదానం చేస్తున్నారు.


- ఆకలిగా ఉన్న వారికి గుప్పెడు అన్నం, ఆపదలో ఉన్న వారికి కొంచెం సాయం, బాధలో ఉన్న వారికి ఓదార్పు అందించడం నిజమైన మానవత్వం.
- ఎదుటి మనిషి కన్నీరు తుడవడానికి బంధుత్వమో, రక్త సంబంధమో, పేగు బంధమో ఉండనక్కర్లేదు. పిడికెడు గుండెలో చిటికెడు మానవత్వం ఉంటే చాలు
- ఎన్ని మతాలున్నా అసలైన మతం మానవత్వం

బ్యాచ్‌మేట్లు..క్లాస్‌మేట్లు

ఆదుకునేందుకు రక్త సంబంధీకులు, బంధువులే కానక్కర్లేదని పరిచయస్తులు, మిత్రులైనా మేలు చేయొచ్చని నిరూపిస్తున్నారు చాలా మంది. కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు, ఒకేసారి కొలువు దక్కి ఒక చోట శిక్షణ పొందిన వారు ఎప్పటికీ కలిసుంటున్నారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు.

రూ.కోటి సాయం చేసి...

2014 సంవత్సరంలో ఎస్సైలుగా ఎంపికై ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న వారు ఓ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమ బ్యాచ్‌మేట్ల కష్టాలను పంచుకునేందుకు వారు చూపిస్తున్న మానవత్వం స్ఫూర్తిదాయకం. ప్రమాదాల్లో, ఇతర ఆరోగ్య సమస్యలతో మరణించిన తమ సహచరుల కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.కోటి వరకు సాయం చేశారంటే మాటలు కాదు. మేమంతా ఏడాదికి రూ.3 వేల సంక్షేమ సంఘానికి అందిస్తామని, అత్యవసరమైతే ఎక్కువ డబ్బులు తలా కొంత ఇస్తామని ఆ బ్యాచ్‌కు చెందిన లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపారు.



మరణించిన బ్యాచ్‌మేట్ కుటుంబానికి సాయమందిస్తూ..

మేమున్నామంటూ..

లక్ష్మణచాంద మండలం వడ్యాల్‌లో 1997-98 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు తమ మిత్రుల కష్టాల్లో పాలుపంచుకుంటున్నారు. మరణించిన ముగ్గురు క్లాస్‌మేట్ల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మరో ఇద్దరు స్నేహితుల వైద్యం కోసం రూ.45 వేలు అందించారు. ఇలా ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా అండగా నిలుస్తున్నారు.



మిత్రుని కుటుంబానికి ఆసరానిస్తూ..

బకాయిలు రాక.. భవనానికి తాళం



కాలక్షేప మండపానికి తాళం వేసిన గుత్తేదారు

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి మండలం కన్నాలలోని శ్రీబుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో నిర్మించిన కాలక్షేప మండపానికి గుత్తేదారు తాళం వేశారు. భక్తుల సౌకర్యం కోసం సుమారుగా రూ. 50 లక్షలు వెచ్చించి నిర్మించారు. పనులు పూయి రెండేళ్లు అవుతున్నా ఇంకా దేవాదాయ శాఖకు సదరు గుత్తేదారు అప్పగించనట్లు సమాచారం. క్యూసీ పనులు కాకపోవడంతో ఇంకా పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాలేదు. అనధికారికంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంతో పగుళ్లు వస్తున్నట్లు, అధికారులు పరిశీలనకు వస్తే రావాల్సిన డబ్బుల్లో కోత పడుతుందని తాళం వేసినట్లు తెలిసింది.

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు



నస్పూర్‌లో ఏర్పాటు చేసిన ల్యాబ్ కార్యాలయం

మంచిర్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆత్మహత్యలు, హత్యలు, దొంగతనాల వంటి నేరాలలో విశ్వసనీయంగా నేర పరిశోధన జరిపే ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ మంచిర్యాలలో ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు మంచిర్యాలతో పాటు ఖమ్మంలో ఈ ల్యాబ్‌లను ప్రారంభించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. హత్య, హత్యాచారం, దోపిడీ కేసుల్లో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణం సంభవించిన మరణాల కారణం తెలుసుకోవడం కోసం వైద్యులు మృతుల రక్తం, ఇతర శరీర భాగాలను పరీక్షించి కరీంనగర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించేవారు. ఇకపై మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు సంబంధించిన కేసులతో పాటు పెద్దపల్లి జిల్లాలోని రామగుండం సబ్‌డివిజన్ కేసులు సైతం మంచిర్యాలలోని ల్యాబ్‌లోనే పరీక్షించనున్నారు. దీంతో కేసు పురోగతిలో వేగవంతం కానున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

గుస్సాడీకి జీవం పోసిన కనకరాజు

ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, జైనూర్: :

రాజ్‌గొండ్‌ల ప్రాచీన విశిష్ట కళ గుస్సాడీ నృత్యం. తలపై నెమలి ఈకలతో అల్లిన టోపి, చేతిలో దండారి, కాళ్లకు గజ్జలు, జంతువుల చర్మంతో చేసిన వస్త్రాలతో పురి విప్పిన నెమలిలా కనకరాజు గుస్సాడీ నృత్యం చేస్తే చూసేందుకు రెండుకళ్లూ చాలవు. ఇందులో ప్రావీణ్యం సంపాదించిన ఆయన ఆదివాసీల నృత్యకళకు జీవం పోశారు. దేవతామూర్తులను ఆరాధించే దండారీ నుంచే స్ఫూర్తి పొంది గుస్సాడీని నేర్చుకున్నానని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. చుట్టు పక్కల పరిసరాల గిరిజనులు ఈయనను ఆదినుంచి కనకరాజుగా కాకుండా గుస్సాడీ రాజుగానే పిలిచేవారు. ఆయన మృతితో ఆదివాసులు శోకసంద్రంలో మునిగారు

ఇందిరాగాంధీ ముందు ప్రదర్శన

1982లో దేశరాజధాని దిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు ప్రదర్శన ఇచ్చారు. అప్పటి ఆదివాసీ, ఉట్నూరు ఐఏయస్ అధికారి తుకారం సిర్పూరు మండలంలోని పిట్టగూడ గ్రామంలో దండారీ (గుస్సాడీ) ఉత్సవాల్లో నైపుణ్యంలో వీరికి శిక్షణ ఇప్పించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన కనకరాజుతోపాటు సార్మెడీ మెస్రం దుర్గారావును దిల్లీకి పంపించారు. కనకరాజు నృత్యాన్ని చూసి ఇందిరాగాంధీ ముగ్ధురాలుకాగా, ఆమె కాలికి కనకరాజు గజ్జెలు కట్టడంతో ప్రధాని సైతం వీరితో పాదం కలిపారు. 2002లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం ముందు చేసిన గుస్సాడీ నృత్యానికి ఆయనను అభినందించారు. ఇప్పటి వరకు 350 పైగా ప్రదర్శనలు ఇచ్చారు. వందలాది మంది ఉత్సాహవంతులైన గిరిజనులకు ఈ నృత్యంలో తర్ఫీదునందించారు. తెలంగాణ నుంచి పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి ఆదివాసీ కళాకారునిగా చరిత్రకెక్కారు. కనకరాజుకు ఇద్దరు భార్యలు ఉండగా, నలుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్లు ఉన్నారు.


పోరాటయోధుడు కుమురం భీం మరణం తరువాత నిజాం మానవ పరిణామ శాస్త్రవేత్త హేమన్‌డార్ఫ్‌ను గిరిజనుల స్థితిగతులు తెలుసుకోవడానికి జిల్లాకు పంపించారు. హేమన్‌డార్ఫ్ కొన్ని సంవత్సరాలపాటు మర్లవాయిలోనే ఉన్నారు. ఆదివాసీలతో మమేకమై వారి జీవన విధానం, కావాల్సిన మౌలిక సౌకర్యాలను అధ్యయనం చేశారు. ఈ సమయంలో కనకరాజు ఈయనతోనే ఎక్కువ సమయం గడిపేవారు. బాలుడి నుంచి యువకుడి వరకు హేమన్‌డార్ఫ్‌తో కలిసి ఉన్నానని పలు సందర్భాల్లో తెలిపారు.



గుస్సాడీ కళాకారులకు శిక్షణ ఇస్తున్న కనకరాజు



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న కనకరాజు



ఇందిరాగాంధీ పక్కన (ఎడమ నుంచి మొదటి వ్యక్తి) కనకరాజు

ఎమ్మెల్యే శంకర్‌కు తప్పిన ప్రమాదం



పగిలిన వాహన అద్దాలు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే పాయల్ శంకర్ త్రుటిలో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. మూసీ బాధితులకు అండగా భాజపా హైదరాబాద్‌లో శుక్రవారం చేపట్టిన ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిలాబాద్‌లో రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకుని హుటాహుటిన బయలుదేరారు. మార్గమధ్యలో కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఎక్స్‌రోడ్డు సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఎమ్మెల్యే వాహనాన్ని ఢీకొట్టింది. వెనక అద్దాలు పగిలాయి. ఆ సమయంలో ఎమ్మెల్యేతో పాటు పీఏ మనోజ్‌పవార్, డ్రైవర్ నవీన్ ముగ్గురే పయనిస్తున్నారు. వెనుక సీటులో కూర్చున్న మనోజ్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. రెండు వాహనాల వేగం తక్కువగా ఉండటంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద విషయం తెలిసి ఎమ్మెల్యే బంధువులు, అభిమానులు అంతా హైరానా చెందారు. ఎమ్మెల్యే తనకేం కాలేదని వీడియో సందేశం విడుదల చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. రాత్రి ఆదిలాబాద్‌కు చేరుకున్న ఎమ్మెల్యే నేరుగా మార్కెట్‌యార్డుకు చేరుకుని పాలనాధికారి రాజర్షిషా సమక్షంలో వ్యాపారులు, రైతులతో జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.

28న పీఎఫ్ మీ ముంగిట

చైతన్యపురి, న్యూస్‌టుడే : కరీంనగర్ భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈనెల 28న పీఎఫ్ మీ ముంగిట (నిధి ఆప్కే నికత్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ సెల్వత్కర్ తానయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు అవగాహన కల్పించి, భవిష్యనిధి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

జిల్లా	కార్యక్రమం జరిగే ప్రదేశం
ఆదిలాబాద్:	నలంద డిగ్రీ కళాశాల సమావేశ గది
మంచిర్యాల:	కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్
కుమురంభీం:	సిర్పూర్ కాగజ్‌నగర్ శ్రీకృష్ణవేణి హైస్కూల్
నిర్మల్ :	ఇబ్రహీంబాగ్ రవి ఉన్నత పాఠశాల

ఇంతి.. సింగరేణి కాంతి

● 16 రకాల పనులు ఎంచుకునే అవకాశం..

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పురుషాధిక్యం ఉన్న సింగరేణిలో మహిళా ఉద్యోగులకు తమ ఉనికిని చాటుకునేందుకు అవకాశం లభించింది. సంస్థలో కారుణ్య నియామకాలు మొదలైన తర్వాత ఉద్యోగాల్లో చేరుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. వీరిలో ఉన్నత విద్య అభ్యసించిన వారు చాలా మంది ఉన్నారు. వీరందరూ సాధారణ ఉద్యోగులు(జనరల్ మజ్దూర్)గా తమ సేవలు అందిస్తున్నారు. భూగర్భ గనుల్లో వీరు విధులు నిర్వర్తించేందుకు అవకాశం లేకపోవడంతో వీరి సేవలు సంస్థ కార్యాలయాల్లోనే వినియోగించుకుంటున్నారు. సంస్థలో ప్రస్తుతం మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతుండటంతో వీరిని ఉపరితలంలోనే 16 రకాల సేవలు వినియోగించుకోవాలని యాజమాన్యం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేట్, ఏరియా స్థాయిల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ విద్యార్హత ఆధారంగా ఉద్యోగినులు ఎంచుకున్న పనులపై శిక్షణ ఇవ్వనుంది.

ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శించేందుకు..



కాసిపేట గనిపై కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కన్వేయర్ ఆపరేటర్, పంపు ఆపరేటర్, వాల్వ్ ఆపరేటర్, చార్జర్ సేఫ్టీ ల్యాంప్, ల్యాంప్ రూం పిట్టర్, కుక్, వెండార్, సర్వే మజ్దూర్, స్టోర్స్ ఇష్యూ మజ్దూర్, బైండర్, శాంప్లింగ్ మజ్దూర్, ఈపీ గ్రీసర్, ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్ వంటి ముఖ్యమైన పనులు ఉన్నాయి. వీటిలో వారు ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శిస్తే మంచి గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగినులు ఎంచుకున్న పనులపై శిక్షణ ఇచ్చి తర్వాత ఆయా పనులు కేటాయిస్తుంది. ఆయా కేటగిరీల్లో అంతర్గత పరీక్షలు రాసి ఉన్నత స్థితికి చేరుకునే అవకాశముంది. ఉన్నత విద్య అభ్యసించి కార్యాలయాల్లో అటెండర్లుగా పని చేసిన వారు ఇకపై సాంకేతిక పరమైన పనుల్లో ప్రతిభ చాటుకునేందుకు వీలు ఏర్పడింది.

కాసిపేట: కాసిపేట గనిలో మహిళా ఉద్యోగులకు ఖాళీగా ఉన్న వివిధ శాఖల ఉద్యోగాలకు శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామని ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఖాళీగా ఉన్న 16 ఉద్యోగాల కోసం మహిళా ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎంచుకున్న ఉద్యోగానికి ముందుగా ఉద్యోగులకు శిక్షణ ఇస్తామన్నారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎంఐఈడీ రాజన్న, వైద్యురాలు భవాని, రామదాసు, భూశంకరయ్య ఉన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌గా దివ్య



శ్రీరాంపూర్ ఏరియాలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో జనరల్ మజ్దూర్ ఉద్యోగిని బి.దివ్య కంప్యూటర్ ఆపరేటర్‌గా సేవలు అందిస్తున్నారు. 2022లో సంస్థలో చేరిన ఆమె ఎంఎస్‌సీ(మ్యాథమేటిక్స్) పూర్తి చేశారు. విద్యార్హత మేరకు అధికారులు ఆమెకు విధులు కేటాయించారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా దివ్య సంస్థకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. మహిళా ఉద్యోగులు యాజమాన్యం సూచించిన పనుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆమె చెబుతున్నారు.

పైళ్ల కూర్పులో నేర్పరి



ఏరియాలోని సీహెచ్‌పీలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న గుడికందుల స్వప్న 2023లో సంస్థలో చేరారు. ఎంబీఏ(హెచ్‌ఆర్‌ఎం) పూర్తి చేసిన ఆమె కార్యాలయంలో చురుకైన పనులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు, సంస్థకు చెందిన పైళ్లను భద్రపర్చడం, వాటిలో ఏవైనా పెండింగ్ సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. యాజమాన్యం సూచించిన పనుల్లో కార్యాలయ అటెండెంట్ ముఖ్యమైన పనే అని స్వప్న అంటున్నారు.

ఈ సన్నాలకే బోనస్



నిర్మల్, న్యూస్‌టుడే: సన్నరకం ధాన్యం క్వింటాలుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించింది. ఏ రకం వంగడాలకు బోనస్ వర్తిస్తుందనే సందేహాలు అన్నదాతల్లో నెలకొన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం 33 సన్నరకాలు గుర్తించింది. సన్నరకం గింజ పొడువు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, మందం 2 మిల్లీమీటర్ల కంటె ఉండాలని ప్రమాణాలు నిర్దేశించింది. ఆ వంగడాలు ఇవే..

సాగవుతున్న సన్న రకాలు

సిద్ధి	(డబ్ల్యూజీఎల్-44)
కంపసాగర్-1	(కేపీఎస్-2874)
సాంబమసూరి	(బీపీటీ-5204)
జగిత్యాల-3	(జేజీఎల్27356)
జగిత్యాల-2	(జేజీఎల్285545)
వరంగల్ సాంబ	(డబ్ల్యూజీఎల్-14)
వరంగల్ సన్నాలు	(డబ్ల్యూజీఎల్-32100)
జగిత్యాల మసూరి	(జేజీఎల్-11470)
పొలాస ప్రభ	(జేజీఎల్-384)
కృష్ణ	(ఆర్ఎన్ఆర్-2458)
మానేరు సోనా	(జేజీఎల్-3828)
తెలంగాణ సోనా	(ఆర్ఎన్ఆర్-15048)
వరంగల్ వరి	-1119
కూనారం వరి-1	(కేఎన్ఎం-733)
కూనారం వరి-2	(కేఎన్ఎం-1638)
వరంగల్ వరి-2	(డబ్ల్యూజీఎల్-962)
రాజేంద్రనగర్ వరి-4	(ఆర్ఎన్ఆర్-21278)
జగిత్యాల సన్నాలు	(జేజీఎల్-1798)
జగిత్యాల సాంబ	(జేజీఎల్-3844)
కరీంనగర్ సాంబ	(జేజీఎల్-3855)
అంజన	(జేజీఎల్-11118)
నెల్లూరి మసూరి	(ఎన్ఎల్ఆర్-34449)
ప్రత్యూమ్న	(జేజీఎల్-17004)
సుగంధ సాంబ	(ఆర్ఎన్ఆర్-2354)
శోబిని	(ఆర్ఎన్ఆర్-2354)
సోమనాథ్	(డబ్ల్యూజీఎల్-347)
ఆర్ఎన్ఆర్	-31479 (పీఆర్‌సీ)
కేపీఎస్	-6251 (పీఆర్‌సీ)
జేజీఎల్	-33124(పీఆర్‌సీ)
హెచ్ఎంటీ సోనా	
మారుటేరు సాంబ	(ఎంటీయూ-1224)
మారుటేరి మసూరి	(ఎంజీయూ-1262)
ఎంటీయూ-1271	